క్లుప్తంగా

నేడు వలంటీర్లకు వందనం

సంబేపల్లె : మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉదయం 10:00 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఎమ్మెల్యే గడికోట శ్రీ కాంత్‌రెడ్డి హాజరవుతున్నట్లు ఎంపీపీ నాగశ్రీలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో ప్రజలకు ఉత్తమ సేవలందిస్తున్న వలంటీర్లకు వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడి చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాజంపేట రూరల్ : డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో 10వ తేదీ శనివారం అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ ఎం.సురేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 33 కెవి, 11 కెవి విద్యుత్ లైన్లకు సమీపంలోని చెట్లను తొలగించే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలియజేశారు. రాజంపేట మండలంలోని బ్రాహ్మణపల్లి, తాళ్లపాక, మందరం, పుల్లంపేట మండలంలోని వత్తలూరు, పెనగలూరు మండలంలోని పెనగలూరు, టి.జి.పల్లి, బెస్తపల్లి, సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలియజేశారు. వినియోగదారులందరూ సహకరించవలసిందిగా కోరారు.

గురుకులంలో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ

నందలూరు(రాజంపేట) : మహాత్మా జ్యోతి బాపూలే ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల 6, 7, 8, 9 తరగతులలో బ్యాక్‌లాగ్ సీట్లలను భర్తీకి చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపాల్ మౌనికా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు పూర్తిగా మెరిట్ విధానంలో ప్రవేశపరీక్ష ఆధారంగా భర్తీకి దరఖాస్తులు కోరడమైందన్నారు. ఇందుకు గాను 12 నుంచి 19 వరకు దరఖాస్తులను ఏ సీట్లలో కోరుకుంటున్నారో, స్టడీ సరిఫికెట్, ఆధార్, రేషన్‌కార్డు, ఫోటోలను జత చేసి అందజేయాలన్నారు. అప్పుడే హాల్‌టికెట్‌ను ఇస్తామన్నారు. ఖాళీ వివరాలను పాఠశాల వద్ద అందుబాటులో ఉంచామని, పరిశీలించుకోవచ్చునని తెలియజేశారు.

14న ఐటీఐలలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

రాజంపేట టౌన్ : అన్నమయ్య జిల్లాలోని మూడు ప్రభుత్వ, పన్నెండు ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాలకు ఈనెల 14వ తేదీ రాజంపేటలోని ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, పారిశ్రామిక శిక్షణా సంస్థ కన్వీనర్ కె.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మెరిట్ నెంబర్ 1 నుంచి ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంట వరకు 59వ మెరిట్ నెంబర్ వరకు కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం 2 గంటల నుంచి మెరిట్ నెంబర్ 60 నుంచి 118 వరకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. అభ్యర్థులకు తమ మెరిట్ నెంబర్‌ను ఇప్పటికే వారి మొబైల్‌కు పంపించామన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు టెన్త్ మార్క్‌లిస్ట్, టీసీ, క్యాస్ట్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, దివ్యాంగులైనట్లయితే అందుకు సంబంధించిన ధృవీకరణ పత్రం, అగ్రవర్ణ పేదలైతే ఈడబ్ల్యూఎస్ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, రెండు ఫోటోలు, వెరిఫికేషన్ సర్టిఫికెట్‌ను తమవెంట విధిగా తీసుకురావాలని శ్రీనివాసరావు తెలియజేశారు.

పోలీసులకు సన్మానం



పోలీసులను సన్మానించిన ఎస్‌ఐ చెన్నకేశవ

నందలూరు(రాజంపేట) : నందలూరు పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న పోలీసులు విజయ్, ప్రసాద్, నరసయ్యలను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎస్‌ఐ చెన్నకేశవ అధ్యక్షతన ఈ సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ శాఖ పరంగా మెరుగైన సేవలందించిన వారికి ఎప్పటికి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక ఏఎస్‌ఐలు, కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన మారెమ్మ జాతర



అలంకరణలో మారెమ్మ

నందలూరు(రాజంపేట): నాగిరెడ్డిపల్లెలో వెలసిన మారెమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. తొలిరోజు శుక్రవారం ఉదయం మహాగణపతి పూజ, స్వస్తివాచనము, ధ్వజారోహణం, హోమం, మారెమ్మ తల్లికి మూలమంత్రహోమాలు నిర్వహించారు. మారెమ్మ, గంగమ్మ, సత్యమ్మలకు 101 టెంకాయలు కొట్టి పూజ చేశారు. సాయంత్రం సాముహిక కుంకుమార్చనలు, మూలమంత్రహోమాలు నిర్వహించారు.

ఒక విప్లవంలా అభివృద్ధి, సంక్షేమం

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి
- రాయచోటి మున్సిపాలిటీ అభివృద్ధిపై సమీక్షించిన గడికోట



సంక్షేమ వివరాలను వెల్లడిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. జగనన్న పాలనలో సంక్షేమ అభివృద్ధి ఒక విప్లవంగా కొనసాగుతోందన్నారు. శుక్రవారం సీసీపల్లెలో రెండువ రోజు కొనసాగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మండల, గ్రామ అధికారులతో కలిసి కడపవాండ్లపల్లె, యర్రదొడ్డిపల్లె, దళితవాడ, వడ్డెపల్లె, నల్లగుండ్లపల్లె, కురవవాండ్లపల్లె, గుర్రంవాండ్లపల్లెలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు జగనన్న సంక్షేమ పథకాల లబ్ధి బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందించారు. ప్రభుత్వం నుం,ఇ అందుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను గురించి ఆరాతీశారు. మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలన్నీ అందుతున్నాయని, ఎక్కడేగానీ పార్టీలు, వర్గాలు లేవన్నారు. గ్రామంలో ఉన్న చిన్న చిన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. బడగు బలహీన వర్గాల ప్రజలకు పెద్దపీట వేయడం, పేదరికాన్ని పాలద్రోలడం వంటి మంచి కార్యక్రమాలకు ప్రభుత్వం చేయూతనిస్తోందని తెలిపారు.

మాజీ ఎంపీటీసీకి పరామర్శ

నల్లగుండ్లపల్లెలోని మాజీ ఎంపీటీసీ సభ్యుడు రామాంజులురెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన స్వగృహంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని కుటుంబ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ జిల్లా పద్మావతమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఎంపీటీసీలు ప్రభావతమ్మ, చిన్నరెడ్డి, సర్పంచ్‌లు చెన్నకేశవరెడ్డి, ఉమాపతిరెడ్డి, కమలమ్మ, ఉమా ప్రభాకర్, జానకమ్మ, సచివాలయం కన్వీనర్ రామేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు క్రిష్టారెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ మస్తాన్, వైస్ చైర్మన్ చెంద్రాయుడు, గుర్రం పద్మనాభరెడ్డి, డీలర్ మల్‌రెడ్డి, వెంకటరమణ, రమణారెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికలతో పట్టణాభివృద్ధి

రాయచోటి అర్బన్ : రాయచోటి పట్టణ అభివృద్ధిపై ముందుచూపుతోపాటు పక్కా ప్రణాళికలతో ప్రత్యేక దృష్టిని సారిద్దామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులకు పిలుపునిచ్చారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఛాంబర్‌లో మున్సిపల్ పరిధిలో వివిధ దశల్లో ఉన్న పలు శాఖల అభివృద్ధి పనులపై అధికారులతో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషాతో కలిసి శ్రీకాంత్ రెడ్డి సమీక్షించారు. అర్హులందరికి పక్కాగృహాలు అందివ్వాలన్నదే ప్రభుత్వ ఆశయమని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. జగనన్న కాలనీల నిర్మాణం పనుల్లో వేగం పుంజుకోవాలని గృహనిర్మాణ శాఖ అధికారులకు ఆయన ఆదేశించారు. అర్హత ఉండి గృహాలు మంజూరుకాని వారికి వెంటనే గృహాలను మంజూరు చేస్తామన్నారు. నారాయణరెడ్డిపల్లె జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలపై ఆయన ఆరాతీశారు. కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించారా అంటూ విద్యుత్ శాఖ అధికారులను అడిగారు. వరిగ, పెమ్మాడపల్లె జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలంటూ సూచించారు.

రహదారుల నిర్మాణంపై శ్రద్ధ

పట్టణంలోని గున్నికుంట్ల రహదారి విస్తరణ పనులు పూర్తయ్యాయని, విద్యుత్ దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని విద్యుత్‌శాఖ అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఠాణా - సుండుపల్లె మార్గంలోని ఆంజనేయస్వామి గుడి వరకు జరుగుతున్న నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనుల గురించి ఆయన ఆర్ అండ్‌బీ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. క్రికెట్ స్టేడియం నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. ఆగస్టులోపు గ్యాలరీ నిర్మాణం పనులు పూర్తి చేయాలంటూ ఆదేశించారు. శిబ్యాల వద్ద జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణంపై ఆరాతీశారు. దేవపట్ల - చిన్నమండెం రహదారి అభివృద్ధి పనులనుపై ఆయన అధికారులతో చర్చించారు. పార్కుల నిర్మాణంతో రాయచోటిని సుందర పట్టణంగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. డైట్ హాస్టల్ ప్రాంగణంలో రూ.73 లక్షలతో చేపట్టిన పార్కు పనుల పురోగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు. రూ.2 కోట్ల నిధులతో చేపడుతున్న మున్సిపల్ సభా భవన నిర్మాణంపై సమావేశంలో చర్చించారు. పట్టణంలోని మదనపల్లె రహదారి మార్గంలో 25 సెంట్ల ప్రభుత్వ భూమిని మున్సిపల్ శాఖ పరిధిలోకి తీసుకుని శాశ్వత అభివృద్ధి పనులు ఏమి చేపట్టవచ్చునో నిర్ణయించాలని కమిషనర్‌కు ఎమ్మెల్యే సూచించారు. పట్టణ పరిధిలో కడప - చిత్తూరు జాతీయ రహదారిలో రాత్రివేళల్లో వీధిలైట్లు వెలగనందున తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, వెంటనే వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలంటూ ఎన్‌హెచ్ అధికారులకు శ్రీకాంత్‌రెడ్డి ఆదేశించారు. చిన్నమండెంలో బ్యాలన్స్ డ్రెయిన్ నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తిచేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనులను సకాలంలో పూర్తిచేయని కాంట్రాక్టర్లను మొదటగా నోటీసులు ఇవ్వాలని, అప్పటికీ స్పందించని పక్షంలో బ్లాక్‌లిస్టులో పెట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, కౌన్సిలర్లు ఆసిఫ్ అలీఖాన్, గౌస్‌ఖాన్, ఈశ్వర్, జబీవుల్లా, రౌనఖ్, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు ఫయాజ్ అహమ్మద్, షబ్బీర్, జానం రవి, సుగవాసి శ్యామ్, అన్నా సలీం, బుజ్జిబాబు, రియాజ్ అహమ్మద్, నేలపాటి వెంకటేష్, హజరత్ ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా శ్రీనివాసులురెడ్డి బాధ్యతల స్వీకరణ

గాలివీడు : గాలివీడు మండలానికి నూతన ఎంపీడీఓగా శ్రీనివాసులురెడ్డి పదవీ బాధ్యతలను శుక్రవారం చేపట్టారు. ఈయన పులివెందుల ఈఓపీఆర్‌డీగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై గాలివీడు ఎంపీడీగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీఓ శేఖర్‌నాయక్‌ను ఈఓపీఆర్‌డీగా కొనసాగనున్నారు. శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సహకారంతో మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



వేణుగోపాలస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

పెనగలూరు : వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. 11 రోజులపాటు గ్రామంలో వివిధ కులాలు వారు బ్రహ్మోత్సవాలలో భాగస్తులయ్యారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించి రోడ్డు వెంబడి విద్యుద్ కటౌట్లను ఏర్పాటు చేశారు. ఈ సారి బ్రహ్మోత్సవాలను చూడటానికి చుట్టు పక్కల గ్రామాలతోపాటు ఇతర మండలాలలోని ప్రజలు హాజరై తమ మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ హేమాద్రి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవాలను జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ ఉత్సవ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. స్వామి వారి ఊరేగింపులో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే జగనన్న లక్ష్యం



పసుపు కొనుగోళ్లను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, సుకుమార్‌రెడ్డి

రాజంపేట రూరల్ : రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగుతోందని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని కె.బోయినపల్లిలోని మార్కెట్ యార్డ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పసుపు కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆకేపాటి ప్రారంభించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పించి జననేత అండగా నిలిచారన్నారు. అదే విధంగా పంట కొనుగోలు కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన ఘనత వైఎస్ జగన్‌దేనని తెలియజేశారు. అనంతరం జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.6850లుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పసుపును విక్రయించదలుచుకొన్న రైతులు సీఎం యాప్‌లో ఈ క్రాప్ ద్వారా వారి పేరును రిజిస్టర్ చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ బియ్యం నరసింహారెడ్డి, డీసీఎంఎస్ మేనేజర్ ఖాదర్‌వలి, జిల్లా మార్కెటింగ్ అధికారి టి.త్యాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.విశ్వనాథరెడ్డి, ఆర్.శ్రీనివాసరాజు, బి.రామ్మోహన్‌నాయుడు, దాసరి పెంచలయ్య, వి.గంగిరెడ్డి, ఎ.సౌమిత్రి, బి.శివయ్య, ఎ.వరదరాజు, ఎం.శ్రీనివాసులగౌడ్, కె.బోయినపల్లి సర్పంచ్ రాజా, ఎంపీటీసీ ఎ.మధుబాబు, రైతులు పాల్గొన్నారు.

వరి సాగుపై రైతులకు అవగాహన



సిద్దవటం: మాట్లాడుతున్న బద్వేల్ ఏడీఏ నాగరాజు


సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లె గ్రామంలో ప్రతి వారం క్లస్టర్ పొలంబడిని నిర్వహిస్తున్నామని, రైతులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని లబ్ధి పొందాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు డి.నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా వంతాటిపల్లె రైతు భరోసా కేంద్రంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ నాగరాజు మాట్లాడుతూ వరిలో సుడామోనస్ వినియోగం, మట్టి నమూనాల సేకరణ విధానం, జీలుగల సాగు ప్రాధాన్యత, వరి సాగులో వివిధ రాజీలేని సూత్రాలు గురించి రైతులకు అవగాహన కల్పించామన్నారు. వరి పంటను ఆశించే వివిధ రకాల పురుగులు, తెగుళ్లను దేశీ వరి రకాల గురించి పూర్తిగా వివరించామన్నారు. వరినారును పరిశీలించి వరిలో విత్తన శుద్ధి, కాలిబాలు, భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం గురించి తెలియజేశామన్నారు. మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో లభించు వివిధ రకాల సేవల గురించి వివరించారు. రైతు భరోసా మొత్తాలు రైతుల అకౌంట్లలో వారంలోపు జమ చేయనున్నట్టు పేర్కొన్నారు. పీఎం కిసాన్, ఈకేవైసీ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సహాయకులు ప్రేమ్‌కుమార్, బి.శివకుమార్, రైతులు, సలహా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పంటలపై రైతులకు అవగాహన కల్పించండి

గాలివీడు : పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని అగ్రికల్చర్ అధికారులకు డీఏఓ చంద్రానాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అగ్రికల్చర్ రైతుల సలహా మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలైందని, ప్రతి రైతులకు ఆర్బీకేలలో అవసరమైన ఎరువులు, మందులను అందుబాటులో ఉంచామన్నారు. వ్యవసాయఅధికారులు రైతులు సాగు చేసిన పంటల వద్దకు వెళ్లి పంటలపై, పంటల మార్పిడిపై సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. రైతులు పంట మార్పిడికి ఎక్కువ శాతం మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏఓ మురళీధర్, సర్పంచ్‌లు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ధనుంజయ రెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ రమణారెడ్డి తెలిపారు.

ప్రభుత్వ స్థలాలను రిజర్వు చేయాలి

- పట్టణానికి ఐదు కిలోమీటర్ల వరకు ఎటువంటి భూ బదలాయింపు చేయకూడదంటూ కౌన్సిల్ తీర్మానం



మాట్లాడుతున్న పోలా శ్రీనివాసులరెడ్డి

రాజంపేట : రాజంపేట పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను రిజర్వు చేయాలని పురపాలక సంఘం చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి అన్నారు. శుక్రవారం పురపాలక సంఘం కౌన్సిల్ హాల్‌లో సాధారణ సమావేశం చైర్మన్ పోలా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థలాల గురించి త్వరలోనే జిల్లా కలెక్టరు గిరీషా పీఎస్‌ను కలిసి కౌన్సిల్ తీర్మానం అందజేస్తామన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పట్టణానికి అన్ని వైపుల ఉన్న ప్రభుత్వ స్థలాలను ఇతరులకు ఇవ్వకుండా ఉంచుకోవడం వలన అనేక అవసరాలకు ఉపయోగపడతాయన్నారు. ఇదే విషయాన్ని కలెక్టరుకు తెలియజేస్తామన్నారు. ఆర్వోబీ పిల్లర్ల మధ్యనున్న ఖాళీ స్థలంలో కొందరు అనుమతులు లేకుండా దుకాణాలు నిర్వహిస్తున్నారన్నారు. వారు స్వచ్ఛందంగా తొలిగించాలని కోరారు. లేకపోతే పురపాలక సంఘం ఆక్రమణలు తొలిగిస్తుందని పేర్కొన్నారు. 45 బ్లాక్స్‌లో గ్రీనరీ పార్కు, రైతు బజారు ఏర్పాటు కృషి చేస్తామన్నారు. రాజంపేట పురపాలక సంఘం పరిధిలో ఇల్లు లేని నిరుపేదలకు ఏపీ టీడ్కో ద్వారా ఇళ్ళు నిర్మించి ఇచ్చేందుకు గాను ఎర్రబల్లి, తాళ్లపాక గ్రామాల్లోని ప్రభుత్వం భూమిని 14 ఎకరాలు పురపాలక సంఘానికి ఇచ్చారన్నారు. రామ్‌నగర్‌లో శాశ్వత మంచినీటి పరిష్కారానికి రూ.5లక్షతో ఒక సంపు నిర్మిస్తున్నామన్నారు. దీని కోసం కౌన్సిల్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో కమిషనరు జనార్దన్‌రెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మర్రి రవి, సుమియా, కౌన్సిలర్లు సనిశెట్టి నవీన్, తంబా సుబ్రమణ్యం, పసుపులేటి సుధాకర్, రాముయాదవ్, కూండ్ల రమణారెడ్డి, బుక్కె విష్ణువర్ధన్‌నాయక్, సత్యాల మౌనిక, పెంచలయ్య నాయుడు, దొంకా సురేష్, తోట వాణి, రేనాటి రాఘవేంద్రరాజు, న్యామతుల్లా, అధికారులు పాల్గొన్నారు.


జగనన్న కాలనీలో భూమిపూజ



భూమి పూజ చేస్తున్న దేవనాథరెడ్డి

చిన్నమండెం : పడమటికోన గ్రామం బోడిరెడ్డిగారిపల్లెలోని జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణ పనులకు జెడ్పీటీసీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆదేశాలతో మండలంలో ఇళ్లులేని వారు ఎవరూ లేకుండా ఉండేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కాలనీలో అన్ని సౌకర్యాలను కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



సిమెంట్ రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీపీ

పుల్లంపేట : గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి పేర్కొన్నారు. దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలన్నారు. శుక్రవారం రెడ్డిపల్లి పంచాయతీలో ఎంపీ నిధులతో రూ. 5 లక్షలతో స్మశానికి సిమెంట్ రోడ్డు పనులు పూర్తి చేశారు. ఎన్నో ఏళ్లుగా స్మశానానికి రోడ్డులేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు రోడ్డు వేయడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీనారాయణ, నాగభూషణంలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

చిట్వేలి : మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన జె.శిరీషాను మండల వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, ఉప సర్పంచ్ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మలిశెట్టి వెంకటరమణ తదితరులు తహసీల్దార్‌ను శాలువా కప్పి సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్ర మంలో వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

సబ్సిడీ విధానాన్ని సద్వినియోగం చేసుకోండి

- వ్యవసాయ సలహా కమిటీ సమావేశంలో సాయికిషోర్‌రెడ్డి, ఏఓ మల్లిక



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ మల్లిక, పక్కన సాయికిషోర్‌రెడ్డి

ఓబులవారిపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో సాయికిషోర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ యంత్ర సేవ ద్వార రాష్ట్రంలో వేలాది మంది రైతులకు ట్రాక్టర్‌లు వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేశారని తెలిపారు. దీంతో చిన్నా సన్నకారు రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. రైతు సంక్షేమ పథకాలు అన్ని అర్హులందరికీ అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు 50 శాతం సబ్సిడీపై సోలర్ ఫెన్సింగ్ కంచె, స్ప్రేయర్లు, పనిముట్లు అందించాలని జింక్, జిప్సమ్ అందించాలని కోరారు. వ్యవసాయ అధికారిణి బి.మల్లికా మాట్లాడుతూ వరి పంటలో కాండం తొలుచు పురుగు నివారణ చేపట్టాలని రైతులకు సూచించారు. ఎంత మోతాదులో మందులు పిచికారీ చేయాలనే విషయాన్ని వివరించారు. రైతులకు ఎటువంటి సమాచారం సూచనలు కావాలన్న ఆర్బీకేలను సంప్రదించాలన్నారు. రైతు లోకేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సబ్సిడీపై పాడిరైతులకు దాణా అందించాలని కోరారు. రైతు పాణ్యం జయరామయ్య మాట్లాడుతూ రైతులకు డ్రిప్ పరికారాల రాయితీలను ఏడు సంవత్సరాలకు కాకుండా ఐదు సంవత్సరాలకు తగ్గించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎన్‌పీ జయపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు జరుగు నారాయణరెడ్డి, పోలి పాపిరెడ్డి, రైతులు వడ్డి చెంగల్‌రెడ్డి, చిల్లా ఈశ్వర్‌రెడ్డి, రైతులు వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు విరాళం అందజేత



చెక్కును అందజేస్తున్న రూపానందరెడ్డి

ఓబులవారిపల్లె : ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధ్వర్యంలో రాజంపేట పార్లమెంట్ పరిధిలో పలు ఆలయాలకు విరాళం అందజేశారు. శుక్రవారం ముక్కా రుపానందరెడ్డి తన క్యాంపు కార్యాలయంలో రూ. 4 లక్షలను రాజంపేట, పుల్లంపేట, రైల్వే కొడూరు మండలాల్లోని పలు రామాలయాలకు, రైల్వేకొడూరు మండలంలోని సాయిబాబా దేవాలయానికి చెక్కుల రూపంలో ఈ విరాళాన్ని అందించారు. ఫౌండేషన్ ద్వార వివిధ సేవా కార్యక్రమలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ముక్కా సాయివికాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు పాముురు రామిరెడ్డి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ ఆరవ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించండి

రాయచోటి అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఫ్యాప్టో అన్నమయ్య జిల్లా ఫ్యాప్టో నేతలు జగన్‌మోహన్‌రెడ్డి, జాబీర్ తదితరులు డీఆర్‌ఓ సత్యనారాయణకు విన్నవించారు. శుక్రవారం ఫ్యాప్టో రాష్ట్రశాఖ పిలుపు మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయులంతా డీఆర్‌ఓను కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల విద్యా కమిషనర్ ఉపాధ్యాయుల పట్ల అనుసరిస్తున్న వ్యతిరేక వైఖరిని వెంటనే విడనాడాలన్నారు. పాఠశాల వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న జీఓ నం.117ను వెంటనే రద్దు చేయాలన్నారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో తిరిగి ఉద్యమ కార్యాచరణలోకి వెళతామంటూ వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నేతలు ఇలియాస్, హరిబాబు, సిబాతుర్ రహిమాన్, రవీంద్రారెడ్డి, కిఫాయతుల్లా, అమీనుల్లా, సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలి

లక్కిరెడ్డిపల్లె : కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సిద్దిగాళ్ళ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్రలో ఇచ్చిన హామీలు నెరవేర్చుటకు ఆంధ్ర రాష్ట్రంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు 2014 ముందు 5 సంవత్సరాలు ఉన్నవారిని మాత్రమే రెగ్యులర్ చేస్తామని చెప్పడం బాధాకరమన్నారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతూ రెగ్యులర్ ఉద్యోగులతోపాటు పని చేస్తూ దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారని, ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమానవేతనం ఇచ్చి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

విద్యార్థులు ఓఎంఆర్ షీటుపై దృష్టి పెట్టండి



అవగాహన కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

పెనగలూరు : పెనగలూరు మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సహజ బ్లెస్సీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ పరీక్ష రాసే సమయంలో విద్యార్థులు ఓఎంఆర్ షీట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి జాగ్రత్తగా పూర్తి చేయాలన్నారు. ఓఎంఆర్ షీటులో తప్పులు దొర్లితే ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. మెరిట్ ప్రకారం పాఠశాలలో వంద సీట్లు పూర్తి చేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. రాత పరీక్షకు 195 మంది ఆరోతరగతి ప్రవేశపరీక్షకు విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు.

నేడు కోనంపేటలో విద్యుత్ అంతరాయం

లక్కిరెడ్డిపల్లె : మండల పరిధిలోని లక్కిరెడ్డిపల్లి టౌన్, కోనంపేట గ్రామాలలో నేడు శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏపీఎస్పీడీసీఎల్ ఏఈఈ ఎస్ హరినాథ్ తెలిపారు. 33కేవీ లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు లక్కిరెడ్డిపల్లె, కోనంపేట సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మద్యం స్వాధీనం

మదనపల్లె : కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ ఎస్‌ఐ హరిహరప్రసాద్ తెలిపారు. నిందితుడి నుంచి మూడు ఫుల్‌బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.